

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	44	22
భద్రాద్రి	44	26






నవీన్ భార్గవి (ఫైల్)

మృత్యువులోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో యువ దంపతుల దుర్మరణం
- పుట్టిన రోజు వేడుక జరుపుకొన్న 48 గంటల్లోనే ఘటన
- సూర్యాపేట జిల్లాలో ఆగి ఉన్న కంటెయినర్‌ను ఢీకొట్టిన కారు
- మృతులు విజయవాడలోని కార్పొరేట్ కళాశాల అధ్యాపకులు
- వైరా మండలం సోమవరంలో విషాదం

వైరా, ఏప్రిల్ 22: తన భార్య జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొని తిరిగి ప్రయాణమైన జంటను రోడ్డుప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. పుట్టినరోజు జరుపుకొన్న 48గంటల్లోనే ఆ దంపతులను మృత్యువు వెంటాడింది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం జిల్లా వైరా మండలం సోమవరం గ్రామానికి చెందిన సామినేని నవీన్ (29), భార్గవి(27) దంపతులు దుర్మరణం చెందారు. సోమవరం గ్రామానికి చెందిన సామినేని వెంకటరామారావు హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడు నవీన్, కోడలు భార్గవి విజయవాడలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. అయితే ఈ నెల 20న నవీన్ తన భార్య భార్గవి జన్మదిన వేడుకలను తల్లిదండ్రుల సమక్షంలో జరుపుకొనేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. భార్గవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన అనంతరం సోమవారం ఉదయం నవీన్, భార్గవి దంపతులు తిరిగి కారులో విజయవాడకు బయలుదేరారు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం గ్రామ సమీపంలో వారు ప్రయాణిస్తున్న కారు జాతీయ రహదారి పక్కన ఆగివున్న కంటైనర్ లారీని ఢీకొట్టడంతో నవీన్, భార్గవి దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. వీరి మృతితో సోమవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సోమవారం సాయంత్రం నవీన్, భార్గవి మృతదేహాలను స్వగ్రామానికి తీసుకువచ్చారు.

ఊహించిన విధంగానే కాంగ్రెస్‌లో ఖమ్మం లోక్‌సభ టికెట్ వ్యవహారం మలుపుల మీద మలుపులు తిరుగుతోంది. టీవీ సీరియల్‌ను తలపిస్తూ రోజుకో ఎపిసోడ్‌గా వస్తోంది. ఈరోజు డిక్లేర్ అవుతుంది.. కాదు రేపు ఖరారవుతుంది.. అంటూ... గత పది రోజులుగా చర్చోపచర్చలు సాగుతున్నాయి. మంత్రుల బంధువులు టికెట్ రేసులో ఉండడం, మరోవైపు పలువురు రాష్ట్ర, జిల్లా నేతలు ఆశావహులుగా దిగి పోటాపోటీగా మంతనాలు సాగిస్తుండడంతో టికెట్ ఖరారు విషయం ఎంతకీ తేలడం లేదు. ఖమ్మం కాంగ్రెస్ టికెట్‌పై కుస్తీ పోటీని తలపించే రీతిలో జాబితా నుంచి ఒక్కో పేరు తగ్గుతూ ఫైనల్ జాబితాలో రాయల, మండవ, రామసహాయం రఘురామిరెడ్డి పేర్లు మిగిలాయి. అయితే ఈ ముగ్గురిలో టికెట్ ఎవరికన్నది సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.



ముగ్గురిలో ఎవరికో!?

✦✦ చివరి దశకు చేరిన ఖమ్మం కాంగ్రెస్ టికెట్ వ్యవహారం ✦✦

- రేసులో మండవ, రాయల, రామసహాయం రఘురామిరెడ్డి
- బెంగళూరులో భట్టి, పొంగులేటితో అధిష్ఠానం చర్చలు
- ఫోన్ ద్వారా మంత్రి తుమ్మలతో సంప్రదింపులు
- సుదీర్ఘంగా సాగుతున్న మంతనాలు
- ఏ క్షణమైనా ప్రకటన వెలువడే అవకాశం
- పార్టీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ

ఖమ్మం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లోని వర్గాలు ఎవరికి వారు తమ అనుకూల అభ్యర్థుల పేర్లను వాట్సాప్‌లో, సోషల్ మీడియాలో, వెబ్‌పేపర్లలో టికెట్ ఖరారైందంటూ మోగిస్తున్నారు. బయోడేటాలు పెడుతున్నారు. దీంతో అటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. ఎవరికి టికెట్ వచ్చిందంటూ పార్టీ నేతలకు, మీడియా ప్రతినిధులకు ఫోన్ చేసి ఆరా తీస్తున్నారు.

ఈ ఉత్కంఠ ఇలా కొనసాగుతుండగా సోమవారం కాంగ్రెస్ అధిష్ఠానం వడపోత చేపట్టింది. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కను బెంగళూరు పిలిచి ఏఐసీసీ అధినేత మల్లికార్జునఖర్గే ఖమ్మం టికెట్‌పై చర్చించారు. ఖర్గేతోపాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీతోపాటు పలువురు ఏఐసీసీ నేతలు చర్చించి భట్టి అభిప్రాయాన్ని తీసుకున్నారు. ఖమ్మం కాంగ్రెస్ టికెట్ తన భార్య నందినికి ఇవ్వాలని, లేని పక్షంలో జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతల్లో ఒకరికి ఇవ్వాలని సూచించినట్టు ప్రచారం జరుగుతోంది.

రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా మల్లికార్జునఖర్గే, ఇతరులను కలిశారు. టికెట్‌పై తన వాదన వినిపించారు. కాంగ్రెస్ పార్టీలో చేరేటప్పుడే తమకు టికెట్ ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చిందని, ఈ హామీని నిలబెట్టుకోవాలని చెబుతూ తన సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డికి ఖమ్మం ఎంపీ టికెట్ ఇవ్వాలని గట్టిగా కోరినట్టు తెలిసింది. అలా కుదరని పక్షంలో తన వియ్యంకుడు, కాంగ్రెస్ సీనియర్ నేత రామసహాయం రఘురామిరెడ్డికి టికెట్ కేటాయించాలని కోరినట్టు తెలిసింది. కాగా ఈ విషయంపై కాంగ్రెస్ అధిష్ఠానం ఖమ్మంలో ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఫోన్ ద్వారా సంప్రదించింది. పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి పార్టీ నిర్ణయించిన అభ్యర్థి విజయానికి కృషి చేస్తానని మంత్రి తుమ్మల చెప్పినట్టు తెలిసింది. కాగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైరా, అశ్వారావుపేట, సత్తుపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కూడా ఫోన్ ద్వారా ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి విషయంపై చర్చించినట్టు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అందిర అభిప్రాయాలు సేకరించిన అనంతరం ఖమ్మం కాంగ్రెస్ టికెట్ విషయంలో రామసహాయం రఘురామిరెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు పేర్లు కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలిస్తోంది. పొంగులేటి సూచించిన వారికి టికెట్ ఇవ్వాలనుకుంటే రామసహాయం రఘురామిరెడ్డికి ఇచ్చే అవకాశం ఉంది. కాగా సోషల్ మీడియాలో మాత్రం జిల్లాలో ఎవరివర్గం వారు తమకు అనుకూలంగా టికెట్ ఖరారైందని ఫోటోలు, బయోడేటాలతో ప్రకటనలు విడుదల చేస్తున్నారు. నామినేషన్ ముహూర్తాలు కూడా పెట్టుకుని ప్రకటనలు గుప్పిస్తున్నారు. దీంతో ఖమ్మం కాంగ్రెస్ టికెట్ ఎవరికి వస్తుందో చెప్పలేని గందరగోళ పరిస్థితి నెలకొంది.



చర్ల మండలంలోని బేస్‌క్యాంప్‌ను పరిశీలిస్తున్న డీజీపీ రవిగుప్తా, పోలీసు ఉన్నతాధికారులు

అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల వేళ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయాలి

- సరిహద్దు రాష్ట్రాల అధికారులతో సమన్వయంతో పని చేయాలి: డీజీపీ రవిగుప్తా
- చర్ల మండలంలోని పోలీసు క్యాంపుల పరిశీలన
- సారపాకలో భద్రాద్రి, ములుగు, భూపాలపల్లి జిల్లాల పోలీసు అధికారులతో సమీక్ష

కొత్తగూడెం/చర్ల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీసు అధికారులంతా అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పని చేయాలని డీజీపీ రవిగుప్త ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల మండలం చెన్నాపురం, పూసుగుప్ప, ఉంజుపల్లిలోని పోలీసు, భద్రతా బలగాల క్యాంపులను సోమవారం డీజీపీ సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి డీజీపీ పలు సూచనలు చేశారు. మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టుల వల్ల లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం డీజీపీ హెలికాప్టర్ ద్వారా భద్రాచలం సమీపంలోని సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. అక్కడ గెస్ట్‌హౌస్ సమావేశ మందిరంలో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాల పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ ఎస్పీలతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టుల వద్ద పని చేస్తున్న అధికారులు అప్రమత్తంగా ఉంటూ అక్రమంగా తరలించే నగదు, మద్యం రవాణాను అడ్డుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మావోయిస్టు ప్రభావిత పోలింగ్‌కేంద్రాల్లో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం డీజీపీ రవిగుప్తతోపాటు పోలీసు అధికారులంతా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు.

సమావేశంలో అడిషనల్ డీజీపీ ఇంటెలిజన్స్ శివధర్ రెడ్డి, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ విజయ్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ సౌత్‌జోన్ అడిషనల్ డీజీపీ రవిదీప్‌సింగ్ సాయి, సీఆర్‌పీఎఫ్ సౌత్ సెక్టార్ హైదరాబాద్ జోన్ ఐజీపీ చారు సిన్హా, ఎస్ఐబీ ఐజీపీ సుమతితోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములుగు, భూపాలపల్లి జిల్లాల ఎస్పీ లు రోహిత్‌రాజు, డాక్టర్ శబరీష్, కిరణ్ ప్రభాకర్ కరే, ఎస్ఐబీ ఎస్పీ రాజేష్, కొత్తగూడెం ఓఎస్‌డీ సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్‌పంతోస్, ఏటూరు నాగారం ఏఎస్పీ మహేష్ జితే, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్‌సింగ్, సీఆర్‌పీఎఫ్ అధికారులు అర్కే పాండు, ఎన్‌కే. మీనా,మోహన్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



భద్రాచలంలో వసంతోత్సవ కళలో కల్యాణ రాముడు

కల్యాణ రాముడికి వసంతోత్సవం

- భద్రాద్రిలో నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు
- రేపు నిత్య కల్యాణాల పునరుద్ధరణ
- రామయ్యను దర్శించుకున్న డీజీపీ రవిగుప్తా, అడిషనల్ డీజీపీ

6

పొగచూరిన నగరం

- దానవాయిగూడెం డంపింగ్ యార్డులోని చెత్తకు నిప్పు
- విపరీతమైన పొగతో మూడు రోజులు జనం ఉక్కిరిబిక్కిరి

7



అంజనేయపురంలో నేలవాలిన మొక్కజొన్న పంట వద్ద రైతు

అన్నదాత గుండెకోత

- భద్రాద్రి జిల్లాను అతలాకుతలం చేసిన గాలివాన
- 670 ఎకరాల్లో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలు
- విరిగిపడిన 278 విద్యుత్ స్తంభాలు,
- దెబ్బతిన్న 48 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- చర్ల మండలంలో పిడుగుపడి మహిళ మృతి

కొత్తగూడెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం సాయంత్రం వచ్చిన గాలివాన తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్‌తీగలు తెగిపోయాయి. ఉరుములు మెరుపులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయాయి. విద్యుత్‌షాక్‌తో పలు ప్రాంతాల్లో పశువులు మృతి చెందాయి. పలు ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. పలు మండలాల్లో కోతకు వచ్చిన వరిపంట నేలకొరిగింది. కల్లాల్లో ధాన్యం సైతం తడిచిపోయింది. మొక్కజొన్న పంటకు సైతం తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల మామిడితోటల్లో కాయలు నేలరాలాయి. గాలిదుమారానికి చెట్లకొమ్మలు విరిగిపడడంతో పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపోయాయి. విద్యుత్‌స్తంభాలు విరిగిపోయాయి.

కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్, పాల్వంచ, ములకలపల్లి, పినపాక, కరకగూడెం మండలాల్లో 278 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. జిల్లా వ్యాప్తంగా 48విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో అయా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖకు సుమారు రూ.68లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టినా చాలాచోట్ల 24 గంటలు గడిచినా విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేకపోయారు. కరకగూడెం మండలంలో అధిక సంఖ్యలో కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. వరిపైరు నేలకొరిగింది. అనంతారంలో భారీగా వరిపంట దెబ్బతిన్నది. ప్రధాన రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని కాంగ్రెస్ మండల నాయకులు పంటలను పరిశీలించి హామీ ఇచ్చారు.



అశ్వారావుపేటలో విరిగిన విద్యుత్ స్తంభం

జిల్లా వ్యాప్తంగా 21 గ్రామాల్లో 188 మంది రైతులకు సంబంధించిన 498 ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖాధికారులు తెలిపారు. ఇక 21 గ్రామాల్లో 65మంది రైతులకుగాను 103 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నదని రైతులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 21 గ్రామాల్లో సుమారు 285 మంది రైతులకు సంబంధించిన 670 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇల్లెందు మండలంలో గాలివానతో తీవ్ర నష్టం సంభవించింది. అశ్వారావుపేట మండలం సున్నంబట్టిలో కరెంట్ లైనుపై తాడిచెట్టు పడడంతో విద్యుత్ తీగలు నేలకూలి ఆ ప్రాంతానికి చెందిన మాడి నాగేందర్‌రావుకు చెందిన ఒక గేదె, రాములమ్మకు చెందిన మూడు గేదెలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాయి. కరకగూడెం మండలం రేగళ్ల గ్రామానికి చెందిన గోగు రాంబాబు రైతు తన ఎడ్లను చెట్టు కిందకట్టేయడంతో కురిసిన వర్షానికి దుక్కిటెద్దులపై పిడుగుపడటంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు ఆ ఎద్దుల విలువ రూ.70వేలు ఉంటుందని తెలిపారు. చర్ల మండలం చింతకుంట గ్రామంలో పిడుగుపడి బొల్లి మహాలక్ష్మి (50) అనే మహిళ మృతి చెందింది.



సాయి అలేఖ్యను అభినందిస్తున్న కలెక్టర్ గౌతమ్

సివిల్స్ ర్యాంకర్‌ను సత్కరించిన కలెక్టర్, సీపీ

ఖమ్మం కలెక్టరేట్/ఖమ్మం క్రైం, ఏప్రిల్ 22: దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన సివిల్ సర్వీసెస్ పరీక్షలో 938వ ర్యాంక్ సాధించిన జిల్లాకు చెందిన రావూరి సాయి అలేఖ్య.. సోమవారం కలెక్టర్ వి.పి.గౌతమ్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయి అలేఖ్యను కలెక్టర్ అభినందించి సత్కరించారు. సాయి అలేఖ్య బోనకల్ మండలం గోవిందాపురం (ఎల్) గ్రామ నివాసి కాగా, ఆమె తండ్రి రావూరి ప్రకాష్‌రావు మధిర టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్‌శ్రేష్ఠ తదితరులు ఉన్నారు. కాగా, సాయి అలేఖ్యను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ కూడా తన చాంబర్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెకు మొక్కను బహూకరించారు. సమాజానికి సేవ చేయాలనే పట్టుదలతో ర్యాంకు సాధించిన అలేఖ్యతోపాటు ఆమె తల్లిదండ్రులను కూడా సీపీ సన్మానించారు.

నాలుగో రోజు 11 నామినేషన్లు

- స్వతంత్ర అభ్యర్థులుగా ఏడుగురు..
- బీఎల్ఎఫ్ తరపున అంథోని సురేష్
- ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున ఉల్లెంగుల యాదయ్య

6

రాములునాయక్ బాటలోనే..

- బీఆర్ఎస్‌కు వైరా, సింగరేణి, జూలూరుపాడు ఎంపీపీల గుడ్‌బై..?
- తమ నేత తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని వెల్లడి
- క్యూ కడుతున్న పలువురు 'గులాబీ' నాయకులు

6

నవ వధువు విషాదాంతం

- ఉన్నత చదువులు చదవలేకపోతానని మనస్తాపం
- 13న ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి



దేవకి (ఫైల్)

చంద్రుగొండ, ఏప్రిల్ 22: పెళ్లయిన 25 రోజులకే ఆమెకు నూరేళ్లు నిండాయి. ఉన్నత చదువులు చదువుకుంటానని చెప్పినా వినకుండా తల్లిదండ్రులు బలవంతంగా పెళ్లి చేయటంతో మనస్తాపం చెందిన ఓ యువతి బలవన్మరణానికి పాల్పడింది. భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలంలోని మంగ్యబంజర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ మాచినేని రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి... మంగ్యబంజర్‌కు చెందిన భుక్యా దేవకి(23) కొత్తగూడెం ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేసింది. ఈ క్రమంలో ఆమెకు వివాహం చేసేందుకు తల్లిదండ్రులు పద్మ, శ్రీను ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయితే తను ఉన్నత చదువులు చదువుతానని, ఇప్పుడే పెళ్లి వద్దని తల్లిదండ్రులకు చెప్పింది. కానీ తల్లి అనారోగ్యంతో ఉందని కుటుంబసభ్యులు ఆమెను పెళ్లికి ఒప్పించారు. ఈ క్రమంలో మార్చి 28న మండలంలోని దుబ్బతండాకు చెందిన యువకుడితో వివాహం నిర్వహించారు. కాగా, ఈ నెల 12న దేవకి తన భర్తతో కలిసి పుట్టింటికి వచ్చింది. 13న భర్త తన ఇంటికి వెళ్లిపోయాడు. అదే రాత్రి దేవకి పురుగులమందు తాగగా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే మొదట జూలూరుపాడుకు అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు. పరిస్థితి విషమించడంతో ఖమ్మం తరలించారు. దేవకి ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్ఐ తెలిపారు.



ఒక్కటయ్యారు..

- ఎమ్మెల్యే తెల్లం, మాజీ ఎమ్మెల్యే పొదెంల ఐక్యతా రాగం
- తాజా, మాజీలను కలిసిన ఎంపీ అభ్యర్థి పోరిక
- నేడు గంగోలులో కాంగ్రెస్ సమావేశం
- పాల్గొననున్న మంత్రి తుమ్మల, తెల్లం, పొదెం, పోరిక



డీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం

భద్రాచలం, ఏప్రిల్ 22: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరిక అనంతరం ఉత్తర దక్షిణ ధ్రువాలుగా ఉన్న తాజా, మాజీల మధ్య సయోధ్య కుదిరిందా అంటే కుదిరిందనే ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు, మాజీ ఎమ్మెల్యే , డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యకు మధ్య సమన్వయం కొరవడిందనే ఊహాగానాలు ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తమయ్యాయి.

ఈ క్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఇరువురి మధ్య సయోధ్యకు సోమవారం భద్రాచలంలోని మాజీ ఎమ్మెల్యే ఇల్లు వేదికైంది. డీసీసీ అధ్యక్షుడు వీరయ్యను, ఎమ్మెల్యే వెంకట్రావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పారు. ఇదే సమయంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ఏ రసూల్ కూడా వారితో ఉన్నారు. రాష్ట్ర పార్టీ సూచనలతో ఇరువురి మధ్య సయోధ్యకు బీజం పడిందని పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

మే 13న పార్లమెంటు ఎన్నికలు ఉన్న నేపథ్యంలో భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంలో తాజా, మాజీలు ఐక్యంగా ముందుకు సాగితేనే పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ భారీగా మెజార్టీ సాధించే అవకాశం ఉంటుందని ఆ పార్టీ భావిస్తోంది. ఈ క్రమంలో ఇందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడంతో అది సత్ఫలితాలనిచ్చే దిశగా ఉందని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదే క్రమంలో సోమవారం భద్రాచలం వచ్చిన పోరిక బలరాంనాయక్ భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావును, డీసీసీ అధ్యక్షుడు వీరయ్యను కలిసి ఎంపీ ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు.

నేడు గంగోలులో సమావేశం

దుమ్ముగూడెం మండలం గంగోలులో కాంగ్రెస్ పార్టీ సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. ఎంపీ ఎన్నికల సమయంలో ఎంతో కీలకమైన ఈ సమావేశానికి మహబూబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. అలాగే భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, మహబూబాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ పాల్గొననున్నారు. ఈ సమావేశానికి భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నారు. సోమవారం రాత్రి భద్రాచలంలో ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ ఎమ్మెల్యే తెల్లం డీసీసీ అధ్యక్షుడు పొదెంతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.




మాజీ ముఖ్యమంత్రులు.. ఖమ్మం ఎంపీలే..

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో ఇదో చిత్రం..

ఖమ్మం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఒక లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవడం, గెలవడం రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులకు ఎక్కువ అవకాశం ఉంటుంది. కానీ ఒకే లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు ఎన్నికల బరిలో ఒకే పార్టీ నుంచి గెలవడం ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో ప్రత్యేకత, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు ఖమ్మం ఎంపీగా పోటీచేసి గెలిచి అందులో ఒకరు కేంద్ర మంత్రి కూడా అయ్యారు. వారే ఈ ఇద్దరు. మాజీ ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, నాదెండ్ల భాస్కరరావు. ఈ ఇద్దరు ఒకనాటి ఖమ్మం ఎంపీలే. 1972లో అప్పటి వేంసూరు నియోజకవర్గం(సత్తుపల్లి) నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన జలగం వెంగళరావు 1973 నుంచి 1979 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆతర్వాత 1984, 1989లో ఖమ్మం ఎంపీగా గెలిచి కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిగా రాజీవ్‌గాంధీ కేబినేట్‌లో కీలకంగా పనిచేశారు. 1989లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు జలగం వెంగళరావు అప్పటి కేంద్రమంత్రిగా ఎన్టీఆర్‌పై దూకుడుగా వ్యవహరించారు. ఆతర్వాత ఆయన రాజకీయాలకు స్వస్తి పలికారు.

ఉమ్మడి ఏపీలోని గుంటూరు జిల్లా వేమూరు శాసనసభ నియోజకవర్గం నుంచి 1983 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన నాదెండ్ల భాస్కరరావు 1984లో ఎన్టీఆర్‌ను దించి తాను ముఖ్యమంత్రి అయి నెలరోజుల పాటు పనిచేశారు. ఆతర్వాత ఆయన ప్రజాస్వామ్య తెలుగుదేశం పార్టీని స్థాపించి కొన్నిరోజుల పాటు నడిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. 1998లో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గాన్ని ఆయనకు కేటాయించింది. సీపీఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రంపై నాదెండ్ల భాస్కరరావు ఎంపీగా గెలిచారు. వాజ్‌పేయి ప్రభుత్వం పడిపోవడంతో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. 1999లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నాదెండ్ల భాస్కరరావుకు ఖమ్మం టికెట్ కేటాయించ లేదు. రేణుకాచౌదరికి టికెట్ కేటాయించడంతో ఆయన జిల్లా రాజకీయాల నుంచి తప్పుకొన్నారు. ఇలా ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు ఖమ్మం లోక్‌సభ నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున ఎంపీలుగా ఎన్నికై జాతీయ రాజకీయాల్లో తమ సత్తా చూపించారు.



జలగం వెంగళ రావు



నాదెండ్ల భాస్కర రావు



సత్తుపల్లి సెగ్మెంట్‌లో పెరిగిన ఓటర్లు

- మహిళా ఓటర్లే అధికం

సత్తుపల్లి, ఏప్రిల్ 22: గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో సత్తుపల్లి సెగ్మెంట్‌లో ఓటర్ల సంఖ్య పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గంలో 2,38,621 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుష ఓటర్లు 1,16,968 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు 1,21,645 మంది, థర్డ్ జండర్ ఓటర్లు ఎనిమిది మంది ఉన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సత్తుపల్లి సెగ్మెంట్‌లో 4,741 మంది ఓటర్లు పెరిగి మొత్తం ఓటర్ల సంఖ్య మొత్తం 2,43,362 కి పెరిగింది. వీరిలో పురుష ఓటర్లు 1,18,267 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,25,083మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 12 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో 18-19 ఏళ్ల ఓటర్లు 7550 మంది ఉన్నారు. సత్తుపల్లి మునిసిపాలిటీ, మండలంలో 64,031 మంది ఓటర్లు ఉండగా కల్లూరు మండలంలో 53,716 మంది, తల్లాడ మండలంలో 45,783 మంది, పెనుబల్లి మండలంలో 43,248 మంది, వేంసూరు మండలంలో 36,584 మంది ఓటర్లు ప్రస్తుతం ఉన్నారు.

మొత్తం 291 పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 291 ఉన్నాయి. వీటిలో సత్తుపల్లి మునిసిపాలిటీ, మండలంలో 75, కల్లూరు మండలంలో 63, తల్లాడలో 57, పెనుబల్లిలో 50, వేంసూరులో 46 పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

మీ వెంటే మేముంటాం..

- మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్‌కు పలువురి మద్దతు
- సంఘీభావం తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న రాములునాయక్

వైరా, ఏప్రిల్ 22: తనను అన్నివిధాలుగా అవమానించిన బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన తాజా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌కు వైరా నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ సంఘీభావం తెలిపారు. భవిష్యత్‌లో రాములునాయక్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని మద్దతు ప్రకటించారు. మీతోనే తమ ప్రయాణమని నాయకులు, కార్యకర్తలు రాములునాయక్‌కు భరోసా ఇచ్చారు. అదే సమయంలో కార్యకర్తలకు వెన్నంటే ఉంటానని రాములునాయక్ స్పష్టం చేశారు. రాములునాయక్ నివాసంలో బీఆర్ఎస్ ఏన్కూరు మాజీ మండల అధ్యక్షుడు బాణోతు సురేష్ అధ్యక్షతన సోమవారం నియోజకవర్గస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఐదుమండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిపించిన చరిత్ర సృష్టించిన ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. 2018ఎన్నికల్లో తాను ఓడించిన వ్యక్తికే 2023లో మళ్లీ బీఆర్ఎస్ టిక్కెట్ ఇచ్చారని, అయినప్పటికీ పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలనే సంకల్పంతో ఎన్నికల్లో ప్రచారం చేశానని గుర్తుచేశారు. ఆ వ్యక్తినే నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. దీన్ని అవమానంగా భావించి ఆవేదనతో అత్యవసరంగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేయాల్సి వచ్చిందని, మీ అందరికి సమాచారం ఇవ్వకుండా రాజీనామా చేసినందుకు కార్యకర్తలు క్షమించాలని కోరారు.

ఈ సందర్భంగా ఎంపీపీలు, ఎంపీటీసీలు, పలువురు నాయకులు మాట్లాడుతూ రాములునాయక్ అడుగుజాడల్లోనే తామంతా నడుస్తామని, ఆయన నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే రాములునాయక్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తారని ఎదురుచూసి అలా చేయకపోయేసరికి నిరాశ చెందామని ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న దండా లింగయ్య, తేజావత్ జోగురాము, ఆంతోని సురేష్

నాలుగోరోజు 11 నామినేషన్లు

- స్వతంత్ర అభ్యర్థులుగా ఏడుగురు..
- బీఎల్ఎఫ్ తరపున అంథోని సురేష్
- ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున ఉల్లెంగుల యాదయ్య

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 22: ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలో నాలుగో రోజు సోమవారం 11 నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా ఏడుగురు వ్యక్తులు ఏడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మధ్యాహ్నం 12గంటలకు స్వతంత్ర్య అభ్యర్థిగా దండా లింగయ్య మూడు సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్‌కు అందజేశారు. 12.57కి మరో అభ్యర్థి తేజావత్ జోగురాము కూడా రెండు సెట్ల నామినేషన్లను అందజేశారు. బహుజన లెఫ్ట్ పార్టీ అభ్యర్థిగా అంథోని సురేష్ నామినేషన్ వేశారు. మరో స్వతంత్ర అభ్యర్థి ఎదురుగట్ల చిట్టిమల్లు తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున ఉల్లెంగుల యాదయ్య నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయనే స్వతంత్ర అభ్యర్థిగా కూడా మరో నామినేషన్ వేశారు. మద్దిశెట్టి ఎర్రప్ప స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్‌ను దాఖలు చేశారు. మరో స్వతంత్ర అభ్యర్థిగా మద్దినేని అనిల్‌కుమార్ నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్‌కు సమర్పించారు. సోమవారం నాడు మొత్తం ఏడుగురు వ్యక్తులు 11నామినేషన్లను అందించారు. ఈ సందర్భంగా నామినేషన్లు నింపిన తీరును, బలపర్చిన వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ తర్వాత రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్ నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారితోపాటు సహాయ రిటర్నింగ్ అధికారి ఆదర్శ్ సురభి ఉన్నారు.



కొణిజర్లలో మాట్లాడుతున్న వినోద్‌రావు

పేదల సంక్షేమం కోసం మోదీ గ్యారెంటీ

- గెలిపిస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తా
- బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు

బోనకల్/ ఏన్కూరు/ కొణిజర్ల, ఏప్రిల్ 22: పేదల సంక్షేమం కోసం ప్రధాని మోదీ చిత్తశుద్ధితో పని చేస్తున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. బోనకల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. తనను గెలిపిస్తే జిల్లాలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని హామి ఇచ్చారు. విద్య, వైద్యంతో పాటు యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలను జిల్లాకు తీసుకు వచ్చేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల వలన ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. తమ పార్టీకి, కాంగ్రెస్ నడుమే ప్రదానంగా పోటీ నెలకొందని, బీఆర్ఎస్ అడ్రస్ లేదని విమర్శించారు. బోనకల్ మండలానికి డిగ్రీ కళాశాల, రైల్వే అండర్ పాస్ నిర్మాణాల కోసం ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర, జిల్లా నాయకులు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, దొంతు జ్వాల, బోళ్ల బిక్షపతి, ఏలూరి నాగేశ్వరావు పాల్గొన్నారు.

● బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ఏన్కూరులో ఆపార్టీ ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. రానున్న కాలంలో భారతదేశం తిరుగులేని శక్తిగా ఎదగాలంటే మళ్లీ మోదీని గెలిపించాలని మోదీ ప్రధాని కావాలంటే ఖమ్మం అభ్యర్థి వినోద్‌రావును గెలిపించాలని పలువురు నాయకులు కోరారు.

● దేశంలో రాబోయే తరాలు సురక్షితంగా ఉండాలంటే కేంద్రంలో నరేంద్రమోదీ ఉండాలని ఖమ్మం బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. కొణిజర్లలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు.

పాలేరులో ఓటమి బాధించింది



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

ఖమ్మం రూరల్/ తిరుమలాయపాలెం, ఖమ్మం లీగల్, ఏప్రిల్ 22: పాలేరు అసెంబ్లీ ఎన్నికల్లో కందాళ ఉపేందర్ రెడ్డి ఓటమి తనను ఎంతో బాధించిందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని పల్లెగూడెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ పార్టీ మండల స్థాయి విస్తృతస్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నామా మాట్లాడుతు గత ఎంపీ ఎన్నికల్లో పాలేరులో అత్యధికంగా 34 వేల ఓట్ల మెజార్టీ వచ్చిందని గుర్తుచేశారు. రైతులు బాగుండాలనే షుగర్ ఫ్యాక్టరీ నష్టాల్లో ఉన్నా కొనుగోలు చే సినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరులో బీఆర్ఎస్ ఓటమి వల్ల ప్రజలు ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ అదే తప్పు జరగకుండా చూసుకోవాలన్నారు. రైల్వేలైన్‌ను ఢిల్లీ స్థాయిలో మాట్లాడి మార్పించినట్లు వివరించారు. ఈనెల 24వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. గడిచిన ఐదేళ్లలో పాలేరులో నాయకుల ఓవర్ యాక్షన్ మూలంగానే నష్టపోయామని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. ఏ ఒక్క రోజు ప్రజలకు దూరంగా లేనని పాలేరుని రాజకీయంగా ఎన్నడూ చూడలేదని కేవలం తన కుటుంబంగానే చూశానని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ నామా నాగేశ్వరరావును పాలేరు లో అత్యదిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎంపీపీ బెల్లం ఉమా, జడ్పీటీసీ సభ్యుడు యండపల్లి వరప్రసాద్, మండలాధ్యక్షుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

● తనను ఆశీర్వదించి గెలిపిస్తే అండగా ఉండి అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలులో బీఆర్ఎస్ మండల స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు.

● ఖమ్మం కోర్టు ప్రాంగణంలో బీఆర్ఎస్‌పార్టీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు న్యాయవాదులను, న్యాయశాఖ ఉద్యోగులను తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

కల్యాణ రాముడికి వసంతోత్సవం

భద్రాద్రిలో నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు



రామాలయంలో రాష్ట్ర డీజీపీ రవిగుప్తా

భద్రాచలం, ఏప్రిల్ 22: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగియనున్నాయి. ఈనెల 9న వసంతపక్ష ప్రయుక్త తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ఆరంభమయ్యాయి. 9న అంకురారోపణం, 14న ధ్వజపట లేఖనం, 15న ధ్వజారోహణం, 16న ఎదుర్కోలు నిర్వహించి 17న శ్రీరామ నవమి సందర్భంగా మిథిలా వేదికపై స్వామివారి కల్యాణం నిర్వహించారు. 18న శ్రీరామ మహాపట్టాభిషేకం చేశారు. కాగా మంగళవారం చక్రతీర్థం, పూర్ణాహుతి, శేష వాహన సేవ, ధ్వజావరోహణం దేవతోద్వాసనం, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశ ఆరాధనలు, శ్రీపుష్ప యాగంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

కల్యాణ రాముడికి వసంతోత్సవం

నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ సీతారామచంద్రస్వామికి ఆహ్లాదకరంగా వసంతోత్సవం నిర్వహించారు. ధ్వజారోహణం అనంతరం 8వ రోజున నూతన వధూవరులైన సీతారాములకు వసంతోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.. ఈ క్రమంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారు, అమ్మవారిని ఎదురెదురుగా కూర్చొబెట్టి వసంతోత్సవాన్ని నిర్వహించారు. వసంతాన్ని ముందు స్వామివారిపై చల్లి చివరగా భక్తులపై చల్లారు. ఈ సందర్భంగా స్వామివారికి సూర్యప్రభ వాహనంలో తిరువీధిసేవ నిర్వహించారు. రాత్రి గజ వాహనంలో తిరువీధిసేవ నిర్వహించారు.

రామయ్యను దర్శించుకున్న పోలీస్ బాస్

భద్రాద్రి రామయ్యను సోమవారం డీజీపీ రవి గుప్తా దర్శించుకున్నారు. ఆయనతో పాటు అడిషనల్ డీజీపీ ఇంటిలిజెన్స్ శివధర్‌రెడ్డి, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ విజయ్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ సౌత్‌జోన్ అడిషనల్ డీజీపీ రవిదీప్‌సింగ్‌సాహి, సీఆర్‌పీఎఫ్ సౌత్ సెక్టార్ హైదరాబాద్ జోన్ ఐజీపీ చారుసిన్హా, ఎస్ఐబీ ఐజీ పి.సుమతిలు సైతం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజాకార్యక్రమాల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అనంతరం దేవస్థానం తరఫున శాలువ, స్వామివారి ప్రసాదాన్ని డీజీపీ, ఇతర పోలీసు ఉన్నతాధికారులకు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు అమరవాది విజయ రాఘవన్, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, ములుగు ఎస్పీలు రోహిత్‌రాజ్, కిరణ్‌ప్రభాకర్ ఖరే, డాక్టర్ శబరీష్, ఎస్ఐబీ ఎస్పీ రాజేష్, కొత్తగూడెం ఓఎస్‌డీ సాయిమనోహర్, భద్రాచలం, ఏటూరునాగరం ఏఎస్పీలు పరితోష్ పంకజ్, మహేష్ జితే, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్‌లు ఉన్నారు.

రేపు నిత్యకల్యాణాల పునరుద్ధరణ

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో దేవస్థానంలో స్వామివారికి నిర్వహించే నిత్య కల్యాణాలకు ఈ నెల 9నుంచి 23 వరకు విరామం ఇచ్చారు. మంగళవారం చక్రతీర్థం, ధ్వజావరోహణం, ద్వాదశ ప్రదక్షణలు, శ్రీపుష్పయాగంలతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానుండటంతో బుధవారం నిత్యకల్యాణాలను పునరుద్ధరించనున్నారు. అలాగే దర్బారుసేవలు సైతం పునః ప్రారంభిస్తారు.

బోర్డు తిప్పేసిన పార్టీ.. బీఆర్ఎస్

- ఇంత వరకు అభ్యర్థిని ప్రకటించలేని పార్టీ కాంగ్రెస్
- ఖమ్మంలో విజయం బీజేపీదే
- కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

నేలకొండపల్లి, ఏప్రిల్22: బీఆర్ఎస్ బోర్డు తిప్పేసిన పార్టీఅని, రూపాయికి బొమ్మా...బొరుసు ఎలానో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కూడా అంతేనని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం నేలకొండపల్లిలో జరిగిన బీజేపీ బూత్ అధ్యక్ష, శక్తి కేంద్ర సమావేశంలో శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీజేపీ ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి తాండ్ర వినోద్ రావు గెలుపు కోసం బూతు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. గత 10 సంవత్సరాలలో మోదీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని కోరారు. ప్రతి బీజేపీ కార్యకర్త పూర్తి సమయం పార్టీ అభ్యర్థి విజయానికి కేటాయించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్యనే పోటీ ఉంటుందని, బీఆర్ఎస్ ఎప్పుడో బోర్డు తిప్పేసిందన్నారు. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని ఉన్నట్లు కాంగ్రెస్ ఇంత వరకు ఖమ్మానికి అభ్యర్థిని ప్రకటించలేక పోవటం దారుణమన్నారు. ఖమ్మంలో బీజేపీ గెలుపు ఎప్పుడో ఖాయమైందని, ప్రచారంలో ప్రజలు బీజేపీ అభ్యర్థికి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తాండ్ర వినీత్‌రావు, నున్నా రవికుమార్, కనగాల వెంకట్రామయ్య, అనంతు ఉపేందర్ గౌడ్, పాగర్తి సుధాకర్, షేక్ షర్ఫుద్దీన్, కోటి హనుమంతరావు, నూరేపల్లి జ్ఞానరత్నం, నున్నా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రాములునాయక్ బాటలోనే..

వైరా, ఏప్రిల్ 22: వైరా నియోజకవర్గంలో ముగ్గురు ఎంపీపీలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసేందుకు రంగాన్ని సిద్ధం చేసుకున్నారు. వైరా, సింగరేణి, జూలూరుపాడ్ ఎంపీపీలు వేల్పుల పావని, మాలోతు శకుంతల, లావుడ్యా సోనీ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పటం దాదాపు ఖాయమైంది. మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఇప్పటికే వైరా తాజా, మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఆయన భవిష్యత్ కార్యాచరణ కోసం సోమవారం ఖమ్మంలోని తమ ఇంట్లో నిర్వహించిన తన అనుచరుల సమావేశానికి ఈ ముగ్గురు ఎంపీపీలు హాజరై ఆయనకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రాములునాయక్ తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటాయని స్పష్టం చేశారు. దాంతో నియోజకవర్గంలోని ముగ్గురు ఎంపీపీలు ఏకకాలంలో బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెపుతున్నట్లయింది. వైరా మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్.బీబా, సింగరేణి మండల ప్రజాపరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.హనీఫ్ కూడా రాములునాయక్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఇప్పటికే బీఆర్ఎస్ ఏన్కూరు మండల అధ్యక్షుడు బాణోతు సురేష్ ఆపార్టీకి రాజీనామా చేశారు. సింగరేణి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉమాశంకర్ కూడా రాములునాయక్‌కు సంఘీభావం తెలిపారు. ఆయన కూడా బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పనున్నారు.

గాలివాన బీభత్సం


అనంతారం గ్రామంలో నేలవాలిన పంట

- ఆకాలవర్షంతో నేలమట్టమైన ఇళ్లు
- కూలిన విద్యుత్ స్తంభాలు
- దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించిన అధికారులు, నాయకులు
- ఆదుకోవాలని అన్నదాతల వేడుకోలు


కారేపల్లిలో రాలిన మామిడి కాయలను ఏరుతున్న రైతు

నేలమట్టమైన ఇళ్లు...

జూలూరుపాడు, ఏప్రిల్ 22: ఆకాలవర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనుల ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఆదివారం సాయంత్రం వీచిన గాలివాన బీభత్సంతో మాచినేనిపేట తండాల్లో ధర్మసోత్ కాళీ, వాంకుడోత్ కస్నా, జెర్పుల పద్మ, లకావత్ కస్నాకు చెందిన ఇళ్ల పై రేకుల కప్పులు దెబ్బతిన్నాయి. అదే విధంగా కొమ్ముగూడెం గ్రామంలో మాలోత్ బుజ్జి ఇంటిపై చెట్టు విరిగిపడటంతో రేకుల ఇల్లు పూర్తిగా దెబ్బతిన్నది. గ్రామంలోని బాణోత్ బోజి, భూక్య పాతిలి, బాణోత్ భారతిల ఇళ్లు దెబ్బతిన్నాయి. ఆకాల వర్షంతో ఇళ్లు నేలమట్టం కావడం తో గిరిజనులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. దెబ్బతిన్న ఇళ్లను సోమవారం ఆర్ఐ తిరపతిరావు, పంచాయతీ కార్యదర్శులు సందర్శించి, వివరాలను నమోదు చేసుకున్నారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని ఆర్ఐ తెలిపారు.


దెబ్బతిన్న పంటను చూపిస్తున్న రైతు

విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి...

అశ్వారావుపేట: మండల పరిధిలోని సున్నం భట్టి, నందిపాడు, నారాయణపురం, గుమ్మడపల్లి, అనంతారం, కావడిగుండ్ల తదితర ప్రాంతాలలో ఆదివారం రాత్రి భారీ గాలిదుమారంతో కూడిన వర్షం కురసింది. ఈ గాలి దుమారానికి సున్నంభట్టి-పాకలగూడెం మధ్యలోని పొలాల్లో తాటి చెట్టు విరిగిపడి విద్యుత్‌వైర్లపైన పడింది. ఈ ఘటనలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ మేత మేయడానికి వెళ్లిన నాలుగు గేదెలు విద్యుదాఘాతానికి గురై సున్నంభట్టి గ్రామానికి చెందిన వగ్గెల రాములమ్మకు చెందిన మూడు గేదెలు, మాడి నాగేంద్రరావుకు చెందిన ఓ గేదె మృతి చెందాయి. దీంతో ఆదివారం రాత్రంతా ఆ పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సోమవారం ఉదయం విద్యుత్ లైన్లను వెతుక్కుంటూ వెళ్లిన విద్యుత్‌శాఖ సిబ్బందికి విద్యుత్ వైర్లు తెగిపడి గేదెలు మృతి చెందిన సంఘటన కనపడింది. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు సంఘటనా ప్రదేశానికి వెళ్లి పరిశీలించి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. మృతి చెందిన గేదె ఒక్కోటి రూ.50 వేల నుంచి 75వేల వరకు ఉంటుందని బాధిత రైతులు చెబుతున్నారు. నష్టపోయిన తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని బాధితులు కోరారు.

పినపాక: ఆదివారం రాత్రి గాలివాన సృష్టించిన బీభత్సానికి మండల వ్యాప్తంగా అనేక ఇండ్లు నేలకూలాయి. పెనుగాలి తాకిడికి రోడ్లపై భారీ వృక్షాలు నేలకొరగడంతో, మణుగూరు ఏటూరునాగారం ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఏడూళ్లబయ్యారం ఎస్.ఐ వెంకటప్పయ్య ట్రాఫిక్ మళ్లించి, విరిగిపడిన చెట్లను తొలగించారు. సోమవారం దెబ్బతిన్న ఇళ్లను డీఎల్పీవో సుధీర్‌కుమార్, తహసీల్దార్ సూర్యనారాయణ, ఎంపీవో వెంకటేశ్వరరావులు పరిశీలించారు. ఇప్పలగుంపులో తాటిచెట్టు కూలి పడడంతో తీవ్రగాయాలైన ఎట్టి సమ్మయ్యను పరామర్శించారు. సీతంపేటలో ఇండ్లు కూలీ నిరాశ్రయులైన బాధిత కుటుంబాలకు నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ రోశయ్య, కార్యదర్శులు అశోక్, జైపాల్‌రెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

కరకగూడెం: అకాల వర్షంతో ఆరుగాలం పండించిన ధాన్యం నేలపాలైంది. గాలివానకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నామని ఏడీఈ జీవన్ కుమార్ తెలిపారు. అదే విధంగా పంట పొలాలను ఏడీఏ తాతారావు పరిశీలించారు. ఇప్పటి వరకు 34 మంది రైతులకు గానూ 75 ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వర్షంతో జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ద్వారా ప్రభుత్వానికి నివేదించి తగిన విధంగా ఆదుకుంటామని సయ్యద్ హస్సేన్ తెలిపారు.

కారేపల్లి: మండలంలో ఆదివారం రాత్రి వీచిన గాలిదుమారంతో అనేక గ్రామాల్లో ఇంటి పైకప్పులు లేచిపోయాయి. మామిడితోటలకు సైతం అపార నష్టం వాటిల్లింది.

పిడుగు పాటుతో మహిళ మృతి


మహాలక్ష్మి

చర్ల, ఏప్రిల్ 22: పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన సంఘటన చింత కుంట గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదివారం రాత్రి ఈదురు గాలులతో వర్షం కురిసింది. అదే సమయంలో గ్రామానికి బొల్లి మహాలక్ష్మి(50) చింతకాయల కోసం చెట్టు దగ్గర వెళ్లింది. ఈ క్రమంలో చెట్టుపై పిడుగు పడింది. చెట్టు కింద ఉన్న ఆమె పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. కాగా ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ఆమె పిడుగుపాటుకు గురైన విషయాన్ని గుర్తించలేకపోయారు. సోమవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించడంతో పిడుగుపడిన విషయం బయటకువచ్చింది. చర్ల ఎస్ఐ నర్సిరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా పిడుగు పాటు గురై చింత కుంట గ్రామంలో టీవీలు, ఏసీలు దెబ్బతిన్నాయి.

పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలంలో ఆదివారం రాత్రి గాలి,వాన బీభత్సం సృష్టించింది. నెహ్రూనగర్ గ్రామంలోని కోళ్ల ఫాం పైకప్పు రేకులు నేలకూలి, సుమారు 100కోళ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ లేక ఇబ్బందులు పడ్డారు. నష్టపోయిన పంటలను సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పాటు వ్యవసాయ అధికారులు పరిశీలించారు.


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

బాధితులను ఆదుకుంటాం

● జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి, ఏప్రిల్22: అకాల వర్షాలకు నష్టపోయిన బాధితులను ఆదుకుంటామని, నష్ట తీవ్రత ప్రాంతాలను సందర్శించి ప్రజలకు భద్రాద్రి జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు సోమవారం హామీ ఇచ్చారు. ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షానికి చుంచుపల్లి మండలంలోని ప్రశాంతి నగర్ గ్రామ పంచాయతీలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి నష్టపోయిన కుటుంబాలకు ధైర్యం చెప్పి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో పెనుబల్లి ఎంపిటిసి రుక్మిణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కనకరాజు, వెంకన్న, నాగేష్, మాజీ సర్పంచ్ హళావత్ రుక్మిణి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంతి నగర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు


మణుగూరులో ధ్వంసమైన ఇండ్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు ఇక్బాల్


చంచుపల్లిలో విద్యుత్ తీగలపై పడిన చెట్టు


పినపాకలో బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందిస్తున్న అధికారులు


సున్నంబట్టి గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలు


మాచినేనిపేట తండాలో నేలమట్టమైన ఇళ్లు

ప్రమాదవశాత్తూ జారిపడి చిన్నారి మృతి


హనిక

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 22: బాత్‌రూంలో కాలుజారిపడి చిన్నారి బాలిక మృతి చెందిన సంఘటన ఇల్లెందు పట్టణంలోని మహబూబాబాద్‌క్రాస్‌రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సీఎస్‌పీ బస్తీ సింగరేణి ఓల్డ్‌కాలనీ టి4క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న సెక్యూరిటీ జమేదార్ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి ఆయన మనవరాలు పెనుగొండ హనిక (5) ఆదివారం అర్ధరాత్రి సమయంలో కాల కృత్యాల నిమిత్తం వెళ్లిన బాలిక ప్రమాదశాత్తూ కాలు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు వెంటనే బాలికను సింగరేణి ఇల్లెందు ఏరియా వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతి చెందినట్లు ధ్రువీకరించారు. చిన్నారి మృతితో ఆ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ పంచాయతీ కార్మికుడు...


ప్రసాద్

కొణిజర్ల,ఏప్రిల్22: చికిత్స పొందుతూ పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అంజనాపురంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల అంజనాపురం గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్న భూక్యా ప్రసాద్(39)ను పంచాయతీ కార్యదర్శి విధులకు రానివ్వడం లేదని, వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఈనెల 28న పురుగులమందు తాగుతున్నానని సెల్ఫీ తీసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిన్నట్లు ఎస్ఐ శంకర్‌రావు తెలిపారు. కార్యదర్శి ఇబ్బందుల వల్లనే నాభర్త చనిపోయినట్లు మృతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వృద్ధుడు..

ఖమ్మంక్రైం, ఏప్రిల్ 22: ఆగి ఉన్న లారీనీ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం ఖమ్మం నగరంలో జరిగింది. నగర శివారులోని మొగిలి పాపిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బల్లేపల్లి ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు ఖమ్మంలో పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

21 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం, ఏప్రిల్ 22: భద్రాచలంలో 21 కేజీల గంజాయిని సోమవారం పట్టణ ఎస్ఐ విజయలక్ష్మి పట్టుకున్నారు. భద్రాచలంలోని కూనవరం రోడ్డులోఉన్న చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇరువురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. ద్విచక్రవాహనంపై ఉన్న వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా, పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో వారిని పట్టుకొని వారి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా, ఆ బ్యాగ్‌లో 21 కేజీల గంజాయి గుర్తించారు. పట్టుబడిన కొలికపోగు చందు, మద్దిరాల జయదేవ్ మానిక్‌లు ఏపీలోని తిరువూరుకి చెందిన వారిగా గుర్తించారు. పట్టుపడిన గంజాయి విలువ రూ.5.25 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడిన వ్యక్తిపై కేసు

పాల్వంచ, ఏప్రిల్ 22: ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడిన వ్యక్తిపై పాల్వంచ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పాల్వంచ పట్టణ పరిధిలోని బొల్లోరిగూడెం గ్రామానికి చెందిన హబీబ్ అబ్దుల్ ఖదీర్ పాల్వంచలోని జాతీయ రహదారిపై ఆటోను అతి వేగంగా, అజాగ్రత్తగా తోలుతూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశాడు. గమనించిన బ్లూకోట్ కానిస్టేబుల్ వేణు ఆటోను స్టేషన్‌కు తరలించి ఫిర్యాదు చేశాడు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినందుకు హబీబ్ అబ్దుల్ ఖదీర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బరగడ వెంకటేశ్వర్లు తెలిపారు.

కల్లూరులో నిర్లక్ష్యంగా వైద్య సేవలు

- ప్రభుత్వ ఆస్పత్రిలో వేసిన వ్యాక్సిన్లతో ఇబ్బందులు పడుతున్న ఇద్దరు చిన్నారులు
- ఒకరికి సర్జరీ చేసినా మానని గాయం
- మరో బాలుడికి సర్జరీ చేయాలని వైద్యుల సలహా

కల్లూరు, ఏప్రిల్ 22: కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లలకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాల వ్యాక్సిన్ల కారణంగా ఇద్దరు చిన్నారులకు గడ్డుకట్టి గాయమైంది. ఈ సంఘటనకు సంబంధించి ఇరువురు పిల్లల కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం ప్రకారం.. కల్లూరులోని ఎల్లావూల వీధి వైపున గల ఎస్‌కే ఉద్దండుసాహెబ్ అస్మాల కుమారుడైన ఎస్‌కే అజాహన్‌కు (9వ నెల) స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గత జనవరి నెల 17న పెంటా వ్యాక్సిన్ మూడో డోస్ వేశారు. ఈ వ్యాక్సిన్‌ను సదరు బాలుడి కుడిచేతి మణికట్టు భాగంలో వేయగా నెల రోజుల తర్వాత గడ్డుగా ఏర్పడింది. దీంతో అజాహన్ బాధపడుతుండగా ఆ పిల్లవాడి తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య చికిత్స కోసం తీసుకోవెళ్లగా సర్జరీ చేయాలని వైద్య సిబ్బంది తెలిపారని పేర్కొన్నారు. అదే విధంగా 17 నెలల నిండిన మరో బాలుడికి కూడా ఇదే ఆసుపత్రిలో గత ఫిబ్రవరి నెల 7న ఎంఆర్ వ్యాక్సిన్ చేశారు. ఇతనికి కూడా కుడి చేతి భాగంలో గడ్డ కట్టి వాపు రాగా, కుటుంబ సభ్యులు ఇతర ప్రాంతాలకు వైద్యం కోసం తీసుకెళ్లగా గడ్డుగా మారిన (కుడి చేతి) భాగంలో చిన్న పాటి సర్జరీ చేశారని తెలిసింది. తమ పిల్లవాడికి గతంలో వ్యాక్సిన్ చేసిన ప్రదేశంలో మరలా వ్యాక్సిన్ ఇవ్వడంతో ఇన్‌ఫెక్షన్ అయినట్లుగా వైద్యులు చెప్పారని వారు బాలుడు తల్లిదండ్రులు తెలిపారు.


అజాహన్‌కు కుడి చేతి మణికట్టు భాగంలో గడ్డుగా ఏర్పడిన దృశ్యం

విచారణ జరుపుతాం

● డీఎంహెచ్‌వో మాలతి

ఆసుపత్రిలో పిల్లలకు వ్యాక్సినేషన్ చేయగా ఇద్దరు పిల్లల కుడి చేతి మణికట్టు భాగంలో గడ్డుగా ఏర్పడి గాయం మారిన విషయమై డీఎంహెచ్‌వో మాలతి దృష్టికి తీసుకెళ్లగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై స్థానిక ఆసుపత్రి వైద్యుడు నవ్యకాంత్ వివరణ ఇస్తూ వ్యాక్సిన్ వేయించుకున్న పిల్లల మణికట్టు చేతి భాగంలో గడ్డుగా ఏర్పడని విషయం తమ దృష్టికి రాలేదన్నారు. బాధితులు తమను సంప్రదిస్తే వైద్య చికిత్స చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

పొగచూరిన నగరం

- దానవాయిగూడెం డంపింగ్ యార్డులోని చెత్తకు నిప్పు
- విపరీతమైన పొగతో మూడు రోజులు జనం ఉక్కిరిబిక్కిరి
- నిప్పు చల్లార్చేందుకు నీళ్లు చల్లుతున్న కేఎంసీ సిబ్బంది

ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్ 22: నగరంలోని దానవాయిగూడెం సమీపంలోని డంపింగ్‌యార్డులో చెత్తకు గుర్తు తెలియనివ్యక్తులు నిప్పటించటంతో పొగ విపరీతంగా వచ్చి ప్రజలు మూడురోజులుగా ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆదివారం సాయం త్రం గాలి దుమారానికి పొగ మరింత వ్యాపించింది. కాగా ఖమ్మం నగరపాలక సంస్థ (కేఎంసీ) సిబ్బంది డంపింగ్‌యార్డ్‌కు ట్యాంకర్లు తరలించి, పైప్‌లతో నీళ్లు చల్లి చెత్తలో ఉన్న నిప్పును ఆర్పుతున్నారు. ప్రతిసారి గుర్తుతెలియని వ్యక్తులు దానవాయిగూడెం డంపింగ్‌యార్డులో చెత్తకు నిప్పుపెట్టడంతో దానవాయిగూడెం, రామన్నపేటతోపాటు రాపర్తి నగర్ సమీపంలోని టీఎన్‌జీవోస్ కాలనీ, బీసీ కాలనీ ప్రజలు పొగతో ఇబ్బందులు పడుతున్నారు. పలువురు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. పొగకు ఉక్కిరిబిక్కిరై గతంలో టీఎన్‌జీవో కాలనీలోని ఓ యువకుడు అనారోగ్యంతో మృతి చెందాడు.

రోజుకు 180 మెట్రిక్ టన్నుల చెత్త

నగరపాలకసంస్థ పరిధిలో రోజుకు 180మెట్రిక్ టన్నులకు పైగా చెత్తను దానవాయిగూడెంలోని డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. వాస్తవంగా ఇక్కడ తడిచెత్త, పొడి చెత్తను వేరుచేసి, తడిచెత్తను ఎరువుగా మార్చటం, పొడిచెత్తను రీసైక్లింగ్ చేయటం చేయాలి. కాగా గత 4నెలలుగా తడిచెత్తను ఎరువుగా మార్చే ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో సుమారు 110 మెట్రిక్ టన్నుల తడిచెత్త డంపింగ్ యార్డులో పేరుకుపోతోంది. పొడిచెత్తను రీసైక్లింగ్ ప్రక్రియ మందకొడిగా సాగటంతో ప్లాస్టిక్ తదితర వ్యర్థాలు సుమారు 70 మెట్రిక్ టన్నులు అలాగే డంపింగ్‌యార్డులో ఉంటున్నాయి. ఇలా పేరుకుపోయిన చెత్త సుమారు 45వేల మెట్రిక్ టన్నులు ప్రస్తుతం దానవాయిగూడెం డంపింగ్‌యార్డులో భారీగా పేరుకుపోయింది. సుమారు 35ఎకరాల విస్తీర్ణంలో ఉన్న డంపింగ్‌యార్డులో గుర్తు తెలియని వ్యక్తులు ఒక మూల నిప్పు అంటించారు. దానిని నగరపాలకసంస్థ సిబ్బంది గమనించేలోపు చెత్త పూర్తిగా అంటుకొని. గత మూడురోజులుగా విపరీతమైన పొగ వ్యాపిస్తోంది. వివిధ ప్రాంతాల్లో పొగ దట్టంగా వ్యాపించి ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి ఏర్పడగా, సోమవారం నాటికి చెత్తలో ఉన్న నిప్పును ఆర్పి, పొగలను కొంతవరకు అదుపు చేయగలిగారు.


డంపింగ్‌యార్డులో చెత్తనుంచి వస్తున్న పొగలు

వాటర్ ట్యాంకులను తీసుకువెళ్లి..

నగరపాలకసంస్థకు చెందిన వాటర్ ట్యాంకులను డంపింగ్‌యార్డుకు తీసుకువెళ్లి, పారిశుధ్య విభాగానికి చెందిన మొత్తం సిబ్బంది అక్కడే విధులు కేటాయించారు. మంటలు అదుపులోకి వచ్చినా, చెత్త అడుగున నిప్పు అలాగే ఉండి, పొగలు రావటంతో పైపుల ద్వారా నీళ్లను చల్లుతున్నారు. గత మూడురోజులుగా ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డంపింగ్‌యార్డులో పనులు చేయటంతో పొగను అదుపు చేయగలిగారు. అసలే ఉక్కపోత, దానికి తోడు రాత్రివేళ పొగ దట్టంగా అలుముకోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కారేపల్లిలో ఎండోమెంట్ ఉద్యోగి సస్పెన్షన్


● ఉత్తర్వులు జారీ చేసిన డిప్యూటీ కమిషనర్

కారేపల్లి, ఏప్రిల్22: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పగడాల మోహన్‌కృష్ణను సస్పెండ్ చేస్తూ దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ తన్నీరు శ్రీకాంతరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..వేంకటేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో ఎండోమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే సంతలో అనేక అవకతవకలు జరుగుతున్నాయని డిప్యూటీ కమిషనర్‌కు కొందరు సమాచారం అందించారు. పలుమార్లు సంతలో తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం జరుగుతున్న అక్రమాలపై సిబ్బందితో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దీంతో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. 60 మేకల లోడుతో సంత నుంచి బయటకు వచ్చిన వాహనాన్ని డీసీ స్వయంగా తనిఖీ చేశారు. కేవలం 20 మేకలకే రుసుం చెల్లించి మిగతావాటికి చెల్లించకుండా వెళ్లుతున్న విషయాన్ని గుర్తించారు. ఈ వ్యాపారితో డీసీ రూ.4,500 వందలు రుసుం కట్టించి రసీదు ఇప్పించారు. రుసుం వసూళ్లలో సదరు వ్యక్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో పాటు విచారణకు వచ్చిన అధికారులపై దురుసుగా ప్రవర్తించారని కారణాలతో జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సస్పెన్షన్ ఉత్తర్వులను ఈవో శేషయ్య ద్వారా సోమవారం మోహన్‌కృష్ణకు స్వయంగా అందజేయడానికి ఉన్నతాధికారులు పంపగా సస్పెన్షన్ ఉత్తర్వులు తీసుకునేందుకు అతడు నిరాకరించారని ఈవో తెలిపారు. సస్పెన్షన్ ఉత్తర్వులను రిజిస్టర్ ద్వారా అతడికి పంపుతామని జిల్లా ఇన్‌స్పెక్టర్ సమత తెలిపారు.

యూట్యూబ్ విలేఖరిపై కేసు నమోదు

పాల్వంచ, ఏప్రిల్ 22: వ్యాపారిని బెదిరించిన ఓ యూట్యూబ్ విలేఖరిపై పాల్వంచ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన ముదిగొండ జయంత్ ఓ యూట్యూబ్ చానల్ విలేఖరిగా చలామణి అవుతున్నాడు. దీంతో ఆగకుండా తాను పోలీసు ఇన్ఫార్మర్‌ను అని చెప్పి స్థానికులను బెదిరించసాగాడు. ఈ క్రమంలోనే ఈ నెల 2న బొల్లోరిగూడెంలో కిరాణా షాపు నడుపుకుంటున్న మన్నేపల్లి వెంకటేశ్వర్ల వద్దకు వెళ్లి పీడీఎస్ బియ్యం అమ్ముతున్నావని అతడిని బెదిరించాడు. రూ.30 వేల నగదు ఇవ్వాలని అతడిని డిమాండ్ చేశాడు. కానీ ఆ సమయంలో అతడి వద్ద కేవలం రూ.24 వేలు ఉండటంతో అవి ఆ వ్యక్తికి ఇచ్చాడు. మిగిలిన రూ.6వేల నగదు కోసం జయంత్ సదరు వ్యాపారిని వేధించసాగాడు. దీంతో స్థానిక వ్యాపారులతో చర్చించిన వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



చింతకాని, ఏప్రిల్ 22: మండల పరిధిలోని వందనం గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న పంట పొలాల్లో సోమవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితం సక్రమంగా లేనటువంటి సదరు మహిళ ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోని పంట పొలాల వైపు నడుచుకుంటూ వచ్చింది. పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులు ఆమెతో మాట్లాడి మంచినీళ్లు తాగమని ఇచ్చినప్పటికి తాగనని, అన్నం తినమని అడిగినా తినలేదని, పంట పొలాల్లో ఎందుకు గ్రామంలోకి వెళ్లమని చెప్పినా వినలేదని తెలిపారు. సోమవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన వారికి పొలాల్లో ఆమె మృతి చెంది కనిపించింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

మృతురాలి వయస్సు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటుందని, చేతిపై ఏ పోచమ్మ అనే పేరుతో పచ్చబొట్టు ఉందని ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు. ఎండ తీవ్రతకు తట్టుకోలేక మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని అన్నం సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు అన్నం శ్రీనివాసరావు సహాయంతో ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

'విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు'

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 22: ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తూనే విద్యుత్‌శాఖ ఉద్యోగులను ప్రమాదాల నుంచి కాపాడుకోవడం టీఎస్ఎన్పీడీసీఎల్ ముఖ్య ఉద్దేశ్యమని టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. తల్లాడ మండలంలోని విద్యుత్ ఉపకేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ పేలుడు ప్రమాదంలో గాయాలైన లింగాచారి వివరాలను సోమవారం ఖమ్మం విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్ ఫోన్‌లో సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. తల్లాడ సబ్ స్టేషన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ప్రొటెక్షన్) సమక్షంలో లైన్‌మన్ వివరాలు నమోదు చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లినప్పుడు భద్రతా నియామాలు పాటించకపోవడంతో ప్రమాదం జరిగిందని సంబంధిత ఏడీఈపై సీఎండీ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఉద్యోగులు విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు.

గురుకుల ప్రవేశాల్లో మల్లవరం విద్యార్థుల ప్రతిభ

తల్లాడ, ఏప్రిల్ 22: తెలంగాణ గురుకుల పాఠశాలల్లో ఐదోతరగతి ప్రవేశ అర్హత పరీక్షలో తల్లాడ మండలం మల్లవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మల్లవరం ప్రాథమిక పాఠశాలలో నాల్గోతరగతిలో మొత్తం 12మంది విద్యార్థులుండగా గురుకుల పాఠశాలల్లో ఐదోతరగతి ప్రవేశం కోసం 11మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 10మంది విద్యార్థులు అర్హత సాధించారు. ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రసన్నకుమార్, వంశీ, యశ్వంత్, రిషి, అక్షయ, క్రిషిత, ఆరాధ్య లాస్య, కుసుమలత, చంద్రిక, రమ్యశ్రీలు గురుకుల పాఠశాలల్లో ప్రవేశ అర్హత సాధించారు. విద్యార్థులను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.పద్మజ, దాసరి వీరభద్రరావు యూత్‌క్లబ్ అధ్యక్షుడు దుగ్గిదేవర అజయ్‌కుమార్, గురుకుల ఉపాధ్యాయుడు తోట కృష్ణారావు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.హరిబాబు, కె.వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
మంగళవారం 23 ఏప్రిల్ 2024



విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

● మణుగూరు న్యాయాధికారి వెంకటేశ్వర్లు



సర్టిఫికెట్‌లు ప్రదానం చేస్తున్న న్యాయాధికారి

మణుగూరుటౌన్, ఏప్రిల్ 22: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ న్యాయాధికారి ఎం వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని ఎక్స్‌లెంట్ స్టార్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అప్పర్ ప్రైమరీ విద్యార్థులకు నిర్వహించిన గ్రాడుయేషన్ డే వేడుకల్లో ఆయన పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్‌లను ప్రధానం చేశారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని, చిన్నారుల తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ యాకూబ్ షరీఫ్, ఖాదర్, ప్రిన్సిపాల్ సమియ నయ్యర్, జీనత్ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక ఉత్పత్తి లక్ష్యం సాధించాలి

- ఈ ఏడాది లక్ష్యం 126.5 లక్షల టన్నులు
- సింగరేణి డైరెక్టర్లు శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి
- పీకేఓసీ నూతన సైట్‌లో పూజలు
- మణుగూరు ఏరియాలో పర్యటన


మొక్కను నాటి నీరు పోస్తున్న డైరెక్టర్‌లు

మణుగూరుటౌన్, ఏప్రిల్ 22: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్, పా ఎస్ వీకే శ్రీనివాస్, డైరెక్టర్ పీఅండ్‌పీ జీ వెంకటేశ్వరరెడ్డిలు ఏరియా జీఎం దుర్గం రామచందర్‌తో కలసి పర్యటించారు. ఇందులో బాగంగా పీకేఓసీ నూతన సైట్ కార్యాలయాల ఆవరణలో నెలకొల్పిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవత మూర్తుల చిత్రపటాలను ఏరియా అధికారులకు అందజేశారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని డైరెక్టర్‌లు, ఏరియా జీఎంతోపాటు ప్రాజెక్ట్ అధికారి తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, అధికారులు నూతన సైట్ కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం పీకేఓసీ-2, పీకేఓసీ-4 గనులను సందర్శించి ఏరియల్ వ్యూ నుంచి ఉత్పత్తి, ఉత్పాదకతలను పరిశీలించారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌లు ఏరియా అధికారులతో మాట్లాడుతూ.. ప్రతి ఏటా పెరుగుతున్న ఉత్పత్తి లక్ష్యాలను సాధించటానికి శ్రామిక శక్తితోపాటు యాంత్రిక శక్తిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. అధిక ఉత్పత్తికి అన్ని రకాల వనరులను యాజమాన్యం అవసరమైన వెంటనే ఆమోదం తెలిపి సమకూరుస్తుందన్నారు. ఈ ఏడాది ఉత్పత్తి లక్ష్యం 126.5 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అధికారులు, కార్మికులు, సూపర్‌వైజర్లు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం వీవీ కాలనీ రోడ్ స్థితి గతులను పరిశీలించారు. కార్యక్రమాల్లో ఏజీఎం సివిల్ డీ వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్, అధికారులు కే వెంకటరావు, రాంబాబు, వీరభద్రుడు, రమణరెడ్డి, లింగబాబు, చిట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవులు ముగిసేలోపు పాఠశాలల

మరమ్మతు పనులు పూర్తిచేయాలి

- అమ్మఆదర్శ పాఠశాల పథకం అమలుపై కలెక్టర్ ప్రియాంక సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిసేలోపు జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా ఎన్నికైన అన్ని పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పడిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, పనులు చేయించే విధానంపై సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో డీఆర్‌డీవో విద్యాచందనతో కలిసి నీటిపారుదల, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, టీఎస్‌ఈడబ్ల్యుఐడీసీ, ఈఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 643 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మంజూరైన పనులు అన్నింటిని ప్రారంభించి మే నెలాఖరుకల్లా పూర్తి చేయడానికి సంబంధించిన ప్రణాళికలను అన్నిశాఖల సమన్వయంతో సమర్పించాలని ఆదేశించారు. కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలో తాగునీరు, తరగతి గదుల్లో చిన్న చిన్న మరమ్మతులు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తదితర సమస్యలను గుర్తించి పనులు పూర్తి చేయాలని సూచించారు. మే 31లోగా మంజూరైన ప్రతి పని పూర్తి చేయాలని, ప్రతి పాఠశాలలో ఎలక్ట్రికల్, తాగునీరు, తదితర పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పని ప్రారంభించే ముందు పూర్తైన తర్వాత ఫోటోస్ అప్‌లోడ్ చేయాలన్నారు. జాతీయ బ్యాంకుల్లో కమిటీల ఖాతాలు తెరిపించాలని, ప్రతిరోజు పనుల పురోగతి పై నివేదికలు అందచేయాలన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

ప్రతి గ్రామ పంచాయతీలో 200మందికి తగ్గకుండ ఉపాధిహామీ పనులు చేపట్టాలని, ప్రతి గ్రామంలో తాగు నీటి సరఫరాను ప్రతిరోజు పరిశీలించాలని తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండ తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీవోలను, పంచాయతీ సెక్రటరీలను సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా రానున్న రోజుల్లో అత్యవసరమైతే తప్ప సెలవులపై వెళ్లరాదని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో గాలి, దుమ్ములు వచ్చే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుని రోడ్లు శుభ్రంగా ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, విద్యశాఖ అధికారి వెంకటేశ్వర చారి, ఆర్‌అండ్‌బీ డీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈ రవికుమార్, ట్రైబల్ వెల్ఫేర్ డీఈ రమేష్‌కుమార్, డీపీఎం సిర్ప్ నాగజ్యోతి, రంగారావు, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంఈవోలు, డీఈలు, ఎపీఎంలు, వీవో అధ్యక్షురాలు, మండల సమాఖ్య ప్రెసిడెంట్లు తదితరులు పాల్గొన్నారు.

2,599 మంది ఆశ్రమ విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ ఆఫీసర్ సంజీవరావు

మణుగూరుటౌన్, ఏప్రిల్ 22: మణుగూరు సబ్ డివిజనల్‌లో ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల కంటి పరీక్షా వైద్య శిబిరాలు సోమవారంతో ముగిసాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, సోషల్ వెల్ఫేర్, మైనారిటీ, కేజీబీవీ ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో ఏప్రిల్ 8న ప్రారంభించిన కంటి వైద్య పరీక్షల శిబిరాల్లో మొత్తం 2,599 మంది విద్యార్థిని, విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 12 మంది చిన్నారులకు మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేయగా.. 90 మంది విద్యార్థులకు కళ్ల జోళ్లు అవసరమని నిర్ధారించారు. వేసవి సెలవు ముగిసి పాఠశాలల ప్రారంభ సమయంలో విద్యార్థులకు అవసరమైన కళ్ల జోళ్లను అందించనున్నట్లు నేత్ర వైద్య సహాయాధికారి జీ సంజీవరావు తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో సోమవారం మాట్లాడారు. వైద్య శిబిరాల్లో డాక్టర్ గోపిలాల్, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది సరస్వతి, ఏఎన్‌ఎం పుష్ప, ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారన్నారు. మణుగూరు పీహెచ్‌సీలో అశ్వాపురం, మణుగూరు, పీనపాక, కరకగూడెం మండలాలకు చెందిన ప్రజలు మంగళవారం, శనివారం కంటి పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు.

ఏడూళ్లబయ్యారం ఇన్‌చార్జ్ ఎఫ్‌ఆర్‌వోగా ద్వాలియా

పినపాక, ఏప్రిల్ 22: మండలంలోని ఏడూళ్లబయ్యారం ఫారెస్ట్ రేంజర్ (ఎఫ్‌ఆర్‌వో)గా విధులు నిర్వహిస్తున్న కే తేజశ్వి సెలవుపై వెళ్లారు. దీంతో ఏడూళ్లబయ్యారం రేంజ్ ఇన్‌చార్జ్‌గా మణుగూరు రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్న జి ద్వాలియాకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన, తేజశ్వి నుంచి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

'ధన్వంతరి' కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్

సుజాతనగర్, ఏప్రిల్ 22: సుజాతనగర్ మండలంలోని 'ధన్వంతరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ' కళాశాలలో మంగళవారం క్యాంపస్ ప్లేస్ మెంట్స్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రముఖ హైదరాబాద్ ఫార్మా కంపెనీ 'దివిస్ ఫార్మా కంపెనీ' పాల్గొన్నది. ఈ కళాశాలలో బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ చదువుతున్న విద్యార్థులతో పాటుగా చుట్టు పక్కల చదువుతున్న వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. 35 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ సంపాదించారని కళాశాల యాజమాన్యం తెలిపింది. ధన్వంతరి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగరాజు, ప్లేస్‌మెంట్ విభాగంలో డాక్టర్ ఎ.ప్రభాకర్ రెడ్డి, కె. విజయ్‌కుమార్, పి.రామ్మోహన్ తదిరులు పాల్గొన్నారు. విద్యార్థులను కళాశాల ఛైర్మన్ డాక్టర్ అరకల భాస్కర్ అభినందించారు.

శ్రామిక రాజ్య స్థాపనకు పోరాడాలి

జూలూరుపాడు/ఆళ్లపల్లి, ఏప్రిల్ 22: లెనిన్‌ను స్ఫూర్తిగా తీసుకొని శ్రామిక రాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరు పోరాడాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని గుండ్లరేవు గ్రామంలో ప్రజాపంథా మండల కమిటి ఆధ్వర్యంలో లెనిన్ 154వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా, నాయకులు ఏదులాపురం గోపాలరావు, నరసింహారావు, రోహిణి, పాపారావు, ఉదయ్‌కుమార్ ,రమణ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లి: రష్యా విప్లవ నాయకుడు, కమ్యూనిస్ట్ రాజకీయ వేత్త వ్లాదిమిర్ లెనిన్ సిద్ధాంతాలను అనుసరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే షాబీర్‌పాష పార్టీ నాయకులకు పిలుపు నిచ్చారు. సోమవారం లెనిన్ 154వ జయంతి వేడుకలను ఆళ్లపల్లి మండలంలో నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, మండల కోఆప్షన్ సభ్యులు రహీం, సీపీఐ నాయకులు పగడయ్య, రాంబాబు, లక్ష్మి, రమేష్, శివ, ఇమ్మానియల్, లాజర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహ ఆవిష్కరణ


దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు

మణుగూరు, ఏప్రిల్ 22: మణుగూరు వాసవీ క్లబ్, వాసవి వనిత వైభవం ఆధ్వర్యంలో సోమవారం కూనవరం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో శ్రీ సరస్వతి దేవి అమ్మవారి విగ్రహాన్ని విగ్రహ దాత క్లబ్ సభ్యులు దోసపాటి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. దోసపాటి మాట్లాడుతూ.. వాసవీ క్లబ్, వనిత క్లబ్‌ల సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు బండారు నరసింహారావు, బొగ్గవరపు అంజలి, మురహరి, చిట్టూరి శేషుబాబు, నాగరత్న, చిత్తలూరి ఉమ, రమేష్‌బాబు, మిట్టపల్లి శ్యాం, పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే మీరాహుస్సేన్, సారయ్య, రవిబాబు, రఘు, జయలక్ష్మీ, కిషన్, పండు, రాజు, ప్రమీల పాల్గొన్నారు.

ఘనంగా శివాలయం వార్షికోత్సవం


పూజలో పాల్గొన్న మహిళలు

ములకలపల్లి, ఏప్రిల్ 22: ములకలపల్లిలో గల శ్రీ ఉమాపృధ్వి రామలింగేశ్వర స్వామి వారి ద్వితీయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం శివాలయంలో ఉదయం నుంచి అభిషేకాలు, సంప్రచన, 108 కలశాలతో పసుపురంగు చీరలు ధరించిన మహిళలు అధిక సంఖ్యలో గంగాజలంతో ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. శివపార్వతి దేవత మూర్తుల కల్యాణం వైభవంగా జరిగింది. అన్నదానంను గాదే తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ అర్చకులు సురేష్ శర్మ, ముకుందల సత్యనారనాయణ శాస్త్రీలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ అధ్యక్షులు నరాటి ప్రసాద్, కోడుమూరు వీరగోపాల్, పువ్వాల లలితారావు, గాదె సత్యనారాయణ రెడ్డి, గాదే తిరుపతిరెడ్డి, బైరుసాయి, వరుణ్, కొడుమూరు బాబురావు, అనుముల సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నష్ట నివారణ చర్యలు చేపట్టాలి

- కలెక్టర్, విద్యుత్‌శాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానం, భారీ ఈదురుగాలులతో తీవ్ర నష్టం వాటిల్లిందని తక్షణమే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి యుద్ధ ప్రాతిపదికన నష్టం నివారణ చర్యలు చేపట్టాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టర్ విద్యుత్‌శాఖ జిల్లా అధికారులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి తగిన చర్యలు చేపట్టాలని కోరారు. వడగండ్ల వాన, ఈదురుగాలులతో పేదల ఇళ్లు నేలమట్టం అయ్యాయని విద్యుత్‌స్తంభాలు నేలకొరిగి అనేక గ్రామాలు, బస్తీలు అంధకారంలో ఉన్నాయని తక్షణమే విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టాలని కోరారు. ఇళ్లు కొల్పోయిన పేదలకు తక్షణ పరిహారం అందచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని,

పూర్తిగా ఇళ్లు కొల్పోయిన వారికి ప్రభుత్వ గృహం మంజూరు చేయించాలని కోరారు. మామిడి, మిర్చి ఇతర పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని సంబంధిత వ్యవసాయ అధికారులతో సర్వే నిర్వహించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను కోరారు.

సీపీఆర్ఎంఎస్ కార్డులను రెన్యువల్ చేసుకోవాలి

●డీజీఎం పర్సనల్ రమేష్

మణుగూరుటౌన్, ఏప్రిల్ 22: విశ్రాంత సింగరేణీయులకు జారీ చేసిన సీపీఆర్ఎంఎస్ మెడికల్ కార్డులను ఏప్రిల్ 30లోపు రెన్యూవల్ చేసుకోవాలని ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్డు రెన్యూవల్‌కు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ పొందడానికి అవకాశం ఉందన్నారు. మీ సేవా కేంద్రాల్లో సీపీఆర్ఎంఎస్ కార్డు, ఆధార్ కార్డులతో రెన్యూవల్ చేసకుని లైఫ్ సర్టిఫికెట్ గడువును పొడిగించుకోవచ్చన్నారు. తద్వారా సింగరేణి సంస్థతో ఒప్పందం చేసుకున్న కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సేవలను అంతరాయం లేకుండా పొందవచ్చని సూచించారు.

ఉపాధి కూలి రూ.600 చెల్లించాలి

దమ్మపేట, ఏప్రిల్ 22: ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని ఏఐపీకేఎంఎస్ కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెడ్యాలపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధిపనులను సోమవారం ఆయన పరిశీలించారు. రాము మాట్లాడుతు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి నిధులు మంజూరు చేయకుండా పథకాన్ని రద్దు చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 రూ.లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాల్వంచ డివిజన్ అధ్యక్షులు కుర్సం ముత్యాలరావు, బండి ఆదినారాణ, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పవిత్రమైనది

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 22: ఓటు హక్కు పవిత్రమైనదని కొత్తగూడెం ప్రభుత్వ పాఠశాలల నోడల్ అధికారి ప్రభుదయాల్ అన్నారు. సోమవారం కొత్తగూడెం మున్సిపాలిటి పరిధిలో గల రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సకల సిబ్బందికి ఓటు యొక్క ప్రాధాన్యతను వివరించారు. దేశంలో ఓటు చాలా విలువైనదని, ఓటర్లకు ఇచ్చిన తెలివైన ఆయుధమన్నారు. ఓటు ప్రాముఖ్యతను తెలుసుకుంటూ ఇతరులకు వివరించాలన్నారు. 18 సంవత్సరాలు పైబడిన ఓటు హక్కు కలిగి ఉన్న విద్యార్థుల బంధువులు, పెద్దలు, తల్లిదండ్రులు అందరికి ఓటు పవిత్రతను తెలియజేస్తూ అందరు ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్య పరచాలని విద్యార్థులను కోరారు. ప్రజా స్వామ్యంలో ఓటుకు గల గొప్ప ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దరిత్రి దినోత్సవం

మణుగూరు, ఏప్రిల్ 22: అశ్వాపురం మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో గల తెలంగాణగిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో ప్రపంచ దరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కాలుష్యాన్ని నివారించి, మొక్కలు నాటి దరిత్రిని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వప్న కుమారి, అధ్యాపకులు సీహెచ్ అపర్ణ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కుమారి, ఎం మనీషా పాల్గొన్నాం

కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలేవి?

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 22: ఎన్నికల కోడ్ అతిక్రమించిన డీఎంఅండ్‌హెచ్‌వో, డీసీహెచ్‌ఎస్‌లపై చర్యలు తీసుకోకుండా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఈ జాప్యంపై రాష్ట్ర హైకోర్టును ఆశ్రయిస్తానని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలలో ఉండగా దానిని అతిక్రమించి డీఎంహెచ్‌వో ఛాంబర్ ఎదుట కాంగ్రెస్ నాయకుడు గొంగళ్ల సంజీవరెడ్డి ఫోటోతో ఉన్న డైరీని ఆవిష్కరించి ఎన్నికల నిబంధనలను అతిక్రమించినారని ఆరోపించారు. ఈ సంఘటనపై ఈ నెల 17న లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినాఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'తప్పుడు కేసును ఎత్తివేయాలి'

పాల్వంచ, ఏప్రిల్ 22: పాల్వంచ మండలం బసవతారకకాలనీలో తమ భూమిలో జామాయిల్ వేశామని, రెండు నెలల క్రితం దానిని నరికామని విచారణ చేయకుండా పాల్వంచ రూరల్ పోలీసులు తప్పుడు కేసు నమోదు చేశారని బాధితులు బానోత్ వీరూనాయక్, రమేష్, సురేష్, గోపాల్ ఆరోపించారు. సోమవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమకు భద్రూనాయక్‌కు ఆస్తి తగాదాలు ఉన్నాయని, ఆ నేపధ్యంలోనే భద్రూనాయక్ తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, తప్పుడు కేసులు పెడుతున్నాడని ఆరోపించారు. తమను హత్య చేయడానికి ప్రయత్నిస్తున్నాడని 2022లోనే భద్రూనాయక్‌పై పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసామని అన్నారు. తమపై పెట్టిన కేసును ఎత్తివేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో వీరూనాయక్ బంధువులు, స్థానికులు పాల్గొన్నారు.

అదుపు తప్పి చెట్టును ఢీ కొన్న కారు

జూలూరుపాడు, ఏప్రిల్ 22: అదుపుతప్పి చెట్టు ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలైన సంఘటన మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కొత్తగూడెం పట్టణానికి చెందిన డీటీ. లోహిత్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు కలిసి కారులో ఖమ్మంలో వివాహ కార్యక్రమంలో పాల్గొని తిరిగి కొత్తగూడెం వెళ్తుండగా, కారు అదుపు తప్పి హోలీఫెయిత్ చర్చి సమీపంలో రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీ కొంది. ఈ సంఘటనలో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని హెడ్‌కానిస్టేబుల్ దయానంద్ సందర్శించి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

బూర్గంపాడు, ఏప్రిల్ 22: కారు అదుపు తప్పి ఆటోను ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని పినపాకపట్టినగర్‌లో చోటు చేసుకుంది. పాల్వంచ వైపునకు వెళ్తున్న కారు అదుపుతప్పి పినపాకపట్టినగర్ వద్ద ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు అభినందనలు

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 22: ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ తెలంగాణ గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు. లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీ పంచాయతీ ఇందిరానగర్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన నిరుపేద కుటుంబంలో పుట్టిన విద్యుర్థులు హంసిని, రిత్విక్ అభిరామ్‌లను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ ఎం ఎం. జ్యోతిరాణి అబినందించారు.

నేడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమావేశం

●ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు/పినపాక/ అశ్వాపురం, ఏప్రిల్ 22: మణుగూరు పట్టణంలోని కిన్నెర కల్యాణ మండపంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌లు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల, పట్టణ అధ్యక్షులు నవీన్, సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు పినపాక మండలంలో ఎమ్మెల్యే పాయం విస్తృతంగా పర్యటించారు. శుభకార్యాలయకు హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అశ్వాపురం: మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ విజయాన్ని కాంక్షిస్తూ మంగళవారం మణుగూరు కిన్నెర కల్యాణమండపంలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ పినపాక నియోజకవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య కోరారు. సమావేశంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, నెల్లిపాక సింగిల్ విండో చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, నాయకులు గాదె కేశవరెడ్డి, తూము రాఘవులు, బచ్చు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అశ్వారావు పేట, ఏప్రిల్ 22: అశ్వారావుపేట పట్టణంలో సోమవారం మండల బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో మోది చేపట్టిన సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్, కాంగ్రెస్ వైఫల్యాలు వివరిస్తూ ఇంటింటికి వెళ్లి ప్రచారాన్ని చేపట్టారు. ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును గెలిపించాలని శ్రేణులు ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌వీటీ కొండ, మండల ప్రదాన కార్యదర్శి జల్లిపల్లి అరవింద్, కలకోటి కృష్ణ, చిట్టి, శ్రవణ్‌కుమార్, కాకి రాము, శ్యామ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రెండు పోలింగ్ కేంద్రాల మార్పు

బూర్గంపాడు, ఏప్రిల్ 22: బూర్గంపాడు మండల పరిదిలోని రెండు పోలింగ్ కేంద్రాలను మార్పు చేసినట్లు తహసీల్దార్ ముజాహిద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మోరంపల్లిబంజర గ్రామంలో గల పోలింగ్ స్టేషన్ నంబర్ 237లో సుమారు 852ఓట్లు వేపలగడ్డ గ్రామపంచాయతీకి చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. వారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి సుమారు రెండు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని ఆ పోలింగ్ స్టేషన్‌ను వేపలగడ్డలోని గిరిజన ప్రాథమిక పాఠశాలలోకి మార్చినట్లు తెలిపారు. దానికి సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి అమోదించినట్లు తెలిపారు. అలాగే బూర్గంపాడులోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 227 పేరు తప్పు(ఎంపీపీఎస్ బూర్గంపాడు)గా నమోదు అయినదని ఆపేరును ప్రభుత్వ జూనియర్ కళాశాల బూర్గంపాడుగా మార్చినట్లు తెలిపారు.

పరీక్షల ఫలితాల విషయంలో ఒత్తిడికి గురికావొద్దు

●విద్యార్థులలో మానసిక ఒత్తిడిని తగ్గించేలా టెలి - మానస్ సేవలు: డీఎంహెచ్‌వో

చుంచుపల్లి, ఏప్రిల్22: విద్యార్థులలో మానసిక ఒత్తిడిని, భయాందోళనను తగ్గించేలా టెలి - మానస్ సేవలు ఉపయోగపడతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష అన్నారు. పదొవ తగరతి, ఇంటర్ ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉన్నందున విద్యార్థుల ఒత్తిడి, భయాందోళనలు తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం టెలి - మానస్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. టోల్‌ఫ్రీ నెంబరు 14416కు ఫోన్ చేసి విద్యార్థులు తమ ఒత్తిడిని తగ్గించుకోవచ్చు అని సూచించారు. అదేవిధంగా ప్రత్యేకంగా సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులను నియమించిందని పేర్కొన్నారు. పరీక్షలు ఫలితాల విషయంలో విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురి కావద్దని టెలి మానస్ సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆసుపత్రుల్లోను విద్యార్థులకు, వారి పేరెంట్స్‌లకి ఉచితంగా సైకాలజిస్ట్ కన్సల్టెషన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండి మనోధైర్యం ఇవ్వాలని, విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయితే ఎవరు అభద్రత భావానికి లోను కావద్దని కోరారు.

అంధకారంలో కొత్తగూడెం

- 24 గంటలైనా విద్యుత్ సరఫరా పునరుద్ధరించని అధికారులు
- ఇక్కట్లలో ప్రజలు
- పలు మండలాల్లోను ఇదే పరిస్థితి


గాలిదుమారానికి తెగిన విద్యుత్ వైర్లు

కొత్తగూడెం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సాయంత్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో గాలిదుమారంతో వచ్చిన వడగండ్ల అకాల వర్షానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గాలి దుమారం వీచడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లు సైతం పెద్ద పెద్ద శబ్దాలతో ఉరుములు రావడంతో పేలిపోయి మరమ్మతులకు గురయ్యాయి. దీంతో కొత్తగూడెం పట్టణంతోపాటు పలు మండలాల్లో విద్యుత్‌సరఫరా లేక అంధకారంలో నెలకొంది. 24గంటలైన విద్యుత్ సరఫరాను విద్యుత్‌శాఖాధికారులు పునరుద్ధరించలేకపోయారు. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒక పక్క 44డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండటంతో ఇళ్లలో విద్యుత్ సౌకర్యాలు లేకపోవడంతో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు నడవక ప్రజలు ఉక్కపోతతో సతమతమవుతున్నారు. తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. ఒక్కసారిగా అంధకారం నెలకనడంతో ప్రజలు, వృద్దులు ఎండతాపానికి గురై అల్లాడిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 9మండలాల్లో పెద్ద ఎత్తున చెట్లుపడిపోవడం విద్యుత్ తీగలు తెగిపోవడం, స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్‌శాఖాధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టినప్పటికి సకాలంలో విద్యుత్ సరఫరాను పునరుద్దరింపచేయలేకపోయారు. దీంతో ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలోని కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్, పాల్వంచ, ములకలపల్లి, పినపాక, కరకగూడెం మండలాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా స్తంభించిపోయింది. అక్కడ విద్యుత్ స్తంభాలు విరిగిపోవడం, పడిపోవడం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో విద్యుత్ నిలిచిపోయింది. మొత్తం మీద విద్యుత్‌శాఖాధికారులు పనులు చేపడంతో సకాలంలో విద్యుత్ రాకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా కొత్తగూడెం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం 5గంటల నుంచి సోమవారం రాత్రి 10గంటల వరకు కూడా విద్యుత్ సరఫరా రాకపోవడంతో పట్టణంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికాక తప్పడం లేదు. ఇప్పటికైన అధికారులు సకాలంలో పనులు పూర్తి చేసి విద్యుత్‌ను పునరుద్దరించాలని ప్రజలు కోరుతున్నారు.